క్లుప్తంగా

వినూత్న మండప నిర్వాహకులకు అభినందన



సీతంపేటలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేటలో క్రేజీ బాయ్స్ ఆధ్వర్యంలో వినూత్నంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాన్ని బుధవారం కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ సందర్శించి దుర్గాదేవికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవోపీ ఫాల్స్ సీలింగ్ మెటీరియల్‌తో మండపాన్ని అద్భుతంగా నిర్మించారని నిర్వాహకులను అభినందించారు. గ్లాస్ ఫ్లోరింగ్‌లో ఆక్వేరియం ఏర్పాటు చేయడం చాలా వినూత్నంగా ఉందని, నగరంలో ఇప్పటి వరకు ఈ విధంగా మండపాన్ని నిర్మించలేదని చెప్పారు. ఈ మండపాన్ని దర్శించిన వారికి కొత్త అనుభూతి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కమిటీ సభ్యులు అచ్యుతరావు, వై.గణేష్, సంతోష్, బి.సంతోష్, పి.శేఖర్, కె.రాంమూర్తి, మహేష్ పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, నిర్వాహకులు

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు పంజాబ్ హోటల్ జంక్షన్ దరి లక్ష్మీగణపతి దుర్గా ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో దసరా నవరాత్రి ఉత్సవాల అనంతరం బుధవారం మహా అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అమ్మవారిని దర్శించుకుని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆటో స్టాండ్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు శ్యామ్, వినోద్, రవి, బాలు, సాయి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి కొండవాలు సమస్యలు



శ్రీనివాస్‌నగర్‌లో డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంకల కవిత

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు బర్మాక్యాంప్, శ్రీనివాస్‌నగర్, జైభారత్‌నగర్ కొండవాలు ప్రాంతాల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు కార్పొరేటర్ గంకల కవిత తెలిపారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో బుధవారం ఆమె పర్యటించారు. కాలువలు, డ్రైనేజీలు శిథిలావస్థకు చేరుకున్నట్లు గుర్తించారు. వార్డులోని సమస్యలపై కార్పొరేటర్ కవితకు స్థానికులు వినతిపత్రాలు అందించారు. వాటిని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మల దృష్టికి తీసుకెళ్లి త్వరలో పనులు ప్రారంభించేలా చూస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు గంకల అప్పారావు, నాయకులు శకుంతల, మహేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 చెల్లించి పూజలో పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్ర నామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 89855 15989కు వాట్సాప్ చేయాలి.

అందరికీ ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం

- నెడ్‌క్యాప్ ఛైర్మన్ కె.కె.రాజు
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన



నరసింహనగర్ యూపీహెచ్‌సీలో వైద్య పరీక్షలు పరిశీలిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్లు



మాధవ స్వామి కల్యాణ మండపంలో కంటి వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కె.కె.రాజు

మద్రిపాలెం: ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని నెడ్‌క్యాప్ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 51వ వార్డు మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో బుధవారం 50వ వార్డు 292 సచివాలయానికి సంబంధించి అంబేడ్కర్ కాలనీ యూపీహెచ్‌సీ పరిధిలోని ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి కె.కె.రాజు రోగులకు వైద్యులు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, మండల కన్వీనర్లు నీలి రవి, పైడి కృష్ణారావు మాస్టారు, సీనియర్ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, సీనియర్ నాయకులు పైడి శ్రీను, పైడి ప్రతాప్, ఎం.లక్ష్మి, సనపల నారాయణస్వామి, ఏఎస్ నాయుడు ఎం.సునీల్, సబ్బవరపు శ్రీను, పొన్నాడ అప్పారావు మాస్టారు, ఏవీఎన్ రాజు, శివరాం ప్రసాద్, టీఎన్ రెడ్డి, జీవీఎంసీ అధికారులు, వైద్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

297 మందికి వైద్య సేవలు

సీతంపేట: రాష్ట్రంలో ప్రజల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా కృషి చేస్తున్నారని నెడ్‌క్యాప్ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని నరసింహనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం 42, 43 వార్డులకు చెందిన నందగిరినగర్ సచివాలయానికి సంబంధించి నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా కొత్తగా ఆరు ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తనూజ పర్యవేక్షణలో స్పెషలిస్ట్ వైద్యులు పల్మనాలజిస్ట్ డాక్టర్ రూప, డెర్మటాలజిస్ట్ డాక్టర్ రమ్యకృష్ణ, జనరల్ సర్జరీ వైద్యులు ముఖుల్ 297 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ వైద్య సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ల్యాబ్ టెక్నీషియన్, డీఈవో, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

165 మందికి వైద్య సేవలు

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల ఆరోగ్యానికి భరోసానిస్తోందని నెడ్‌క్యాప్ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 54వ వార్డు పాత ఐటీఐ జంక్షన్ పరిధి సచివాలయానికి సంబంధించి భవానీ గార్డెన్స్ యూపీహెచ్‌సీలో బుధవారం జరిగిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి పరిశీలించారు. జీవీఎంసీ అధికారుల నేతృత్వంలో వైద్యాధికారులు సుమారు 165 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎ.ఎల్.శాంతి తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చల్లా రజిని, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గవర నాయుడు, ఫార్మాసిస్ట్ సింహాచలం, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం సందర్శన

మురళీనగర్: ప్రజలందరికీ ఆరోగ్య రక్షణ కల్పించడమే ధ్యేయంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నెడ్‌క్యాప్ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 49వ వార్డు అల్లూరి సీతారామరాజునగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొనసాగుతున్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావుతో కలిసి ఆయన సందర్శించారు. వైద్య పరీక్షలకు వచ్చిన వారితో మాట్లాడారు. వైద్య పరీక్షల నిర్వహణ, ఉచిత మందులు పంపిణీ వంటి అంశాలను కె.కె.రాజు పరిశీలించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, మండల కన్వీనర్ నీలి రవి, స్థానిక నాయకులు ఢిల్లీ రావు, ఎస్.చంద్రశేఖర్, ఎస్.శ్రీను, ఏవీఎన్ రాజు, శివరామ్‌ప్రసాద్, బోళెం సరస్వతి పాల్గొన్నారు.



ఏఎస్సార్ నగర్ వైద్య శిబిరంలో మందులు అందిస్తున్న కె.కె.రాజు, బాణాల, అల్లు శంకరరావు

ఆరోగ్య సురక్షతో ఎంతో మేలు



రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు ఎంతో మేలు చేకూరుతోంది. బీపీ, సుగర్‌తోపాటు మక్క నొప్పితో బాధపడుతున్నానని చెప్తే వైద్యులు మంచిగా పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

– ఎం.కృష్ణమూర్తి, మాధవధార, 50వ వార్డు

నేడు మధురానగర్ హైస్కూల్‌లో ఆరోగ్య సురక్ష శిబిరం

సీతంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో జరుగుతుందని 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఒక ప్రకటనలో తెలిపారు. 130, 132 సచివాలయాల పరిధిలోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్పెషలిస్ట్ వైద్యులచే పరీక్షలు, ఉచితంగా మందులు, రక్త పరీక్షలు జరుగుతాయని, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలు పొందాలన్నారు.

మహిళలకు పనిప్రదేశంలో కూర్చునే హక్కు కల్పించాలి

మద్రిపాలెం: గ్రామిక మహిళలకు పనిప్రదేశాల్లో కూర్చునే హక్కు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ విభాగం ఛైర్మన్ మూల వెంకటరావు బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. షాపింగ్ మాల్స్‌లో పనిచేసే మహిళలకు కూర్చునే హక్కు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చట్టం తేవాలని కోరారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ తరహా చట్టాలు ఉన్నాయని గుర్తుచేశారు. షాపింగ్ మాల్స్‌లో మహిళలు కూర్చోడానికి కుర్చీలు, స్టూళ్లు, బల్లలు ఏమీ ఉండవని పేర్కొన్నారు. వారు అధిక సమయం నిలబడి ఉండటం వల్ల మూత్రాశయ వ్యాధులు, కాళ్లపై వెరికోస్, వేయిన్స్, వెన్నుపూస, నడుం నొప్పి వంటి రుగ్మతలు వస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. పనిప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులు కూడా అధికంగానే ఉన్నాయన్నారు. మహిళల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్షణమే ఈ సమస్య పరిష్కారంలో భాగంగా చట్టం చేయాలని ఆయన కోరారు.

జూలో ఆట పరికరాల ఏర్పాటు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కుకు వెళ్లే పిల్లలు వన్యప్రాణుల సందర్శనతో పాటు ఎంచక్కా ఆటలాడుకోవచ్చు కూడా. ఇక్కడ వందల సంఖ్యలో వన్యప్రాణులున్నాయి. వాటిని తిలకించడంతో పాటు సరదాగా ఆడుకోవడం కోసం ఇటీవల జూ అధికారులు ఆట పరికరాలు ఏర్పాటు చేశారు.

రేషన్ డిపోల్లో తనిఖీలు

కంచరపాలెం: కంచరపాలెం సర్కిల్–1 పరిధి దేవేంద్రనగర్, ధర్మానగర్, రెడ్డికంచరపాలెం రవీంద్రనగర్ ప్రాంతాల్లోని పలు రేషన్ డిపోల్లో బుధవారం సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్–1 ఏఎస్‌వో మురళీధర్ మాట్లాడుతూ రేషన్ సరకుల పంపిణీలో పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిపోల్లో తనిఖీలు చేసి సరకులు, కార్డు హోల్డర్ల వివరాలపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నిత్యావసర సరకులు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. అవకతవకలకు పాల్పడితే డిపో లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. తనిఖీల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రమణ, లలిత, అనూష తదితరులు పాల్గొన్నారు.



దేవేంద్రనగర్ రేషన్ డిపోలో తనిఖీలు చేస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు

వ్యక్తి ఆత్మహత్య



రాము మృతదేహం

మద్రిపాలెం: కంచరపాలెం ఫిఫ్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురం చాకలిగెడ్డ ప్రాంతంలో నివసిసున్న డి.రాము(55) గతంలో తాపీమేస్త్రిగా పనిచేసేవాడు. రెండేళ్ల నుంచి పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. అతడికి మద్యం తాగే అలవాటు ఉంది. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి భార్య డి.లక్ష్మి ఉదయం 10 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లి తిరిగి సాయంత్రం 5 గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి గదిలో ఫ్యానుకు తాడుతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఆమె ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ నరసింహం కేసు దర్యాప్తు చేపట్టారు.

భగవద్గీత సారంపై ప్రవచనం

సీతంపేట: కంచికామకోటి శంకరమఠం, గీతా ప్రచార సమితి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం శ్రీమద్ భగవద్గీత సారంపై శంకరమఠం ప్రాంగణంలో ప్రవచనం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, ఆచార్య మద్దులపల్లి దత్తాత్రేయ శాస్త్రి భగవద్గీత సారంపై ప్రవచనం చేసి దాని విశిష్టతను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ గీతా సారాంశాన్ని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో గీతా ప్రచార సమితి అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు, పలు ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రవచిస్తున్న ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, ఆచార్య దత్తాత్రేయ శాస్త్రి

అలరించిన కథా కచేరీ

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కథా కచేరి అలరించింది. కథకుల స్వీయ కథా పఠనం, వైవిధ్యంతో నిండిన కథలు అందరినీ ఆలోచింపజేశాయి. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ తెలుగు కథకు ఉత్తరాంధ్ర పుట్టినిల్లని, కథల్లో వివిధ రకాలను వివరించారు. డాక్టర్ కె.జి.వేణు విశిష్ట కథా పరిచయం శీర్షికలో రచయిత ఈతకోట సుబ్బారావు కథానిక ప్రాణం ఖరీదును చక్కగా విశ్లేషించారు. అనంతరం జరిగిన కథా కచేరీలో భాగవతుల సత్యనారాయణమూర్తి కథానిక మానవత్వం ఖరీదు, కె.వి.ఎస్.మూర్తి కథానిక అనసూయమ్మ గారి ఆరోప్రాణం, అయ్యలసోమయాజుల ప్రసాద్ దమయంతమ్మ దసరా పండగ కథానిక, కుప్పిలి భీమేశ్వరరావు దిక్సూచి కథానిక, కొత్తూరి రమణ పెళ్లిపుస్తకం కథానికలు వివిధ అంశాలను స్పృజించి అలరించాయి. కార్యక్రమంలో సాహితీ విమర్శకుడు డి.వి.సూర్యారావు, కె.రాంప్రసాద్, వేదుల కామేశ్వరశర్మ, శ్రీనివాసరావు, రాధారాణి పాల్గొన్నారు.



కథానిక చదువుతున్న అయ్యలసోమయాజుల ప్రసాద్

వృద్ధ దంపతులకు హెల్త్ క్లబ్ సాయం

మురళీనగర్: మురళీనగర్‌కు చెందిన వృద్ధ దంపతులకు శ్రీనివాసనగర్ వాకర్స్ హెల్త్ క్లబ్ సాయం అందించింది. క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ తరఫున వృద్ధ దంపతుల కుటుంబానికి వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ యు.శుభ నిత్యావసర సరకులు అందించారు. కార్యక్రమంలో యూనివర్సల్ యూత్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ కృష్ణవర్మ, 101 క్యాబినెట్ సెక్రటరీ సీహెచ్ జ్యోతి, వాకర్స్ హెల్త్ క్లబ్ కోశాధికారి ప్రవీణ పాల్గొన్నారు.



వృద్ధ దంపతులకు నిత్యావసర సరకులు అందిస్తున్న శుభ, శ్రీనివాసరాజు

ఉల్లి కోసం బారులు



సీతమ్మధార రైతుబజారులో ఉల్లిపాయల కోసం క్యూకట్టిన వినియోగదారులు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులో బుధవారం కిలో ఉల్లిపాయలు రూ.46కు విక్రయించారు. కొద్ది రోజుల కిందట రూ.36గా ఉన్న ఉల్లి ధర ఒక్కసారిగా రూ.46కు పెరగడంతో వినియోగదారులు క్యూ కట్టారు. బజారులో రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.50కు విక్రయిస్తున్నారు. గురువారానికి కిలో ఉల్లి రూ.50కు పెరిగే అవకాశం ఉంది. రైతుబజారు ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ పర్యవేక్షించారు.

సర్వాంగ వజ్రకవచధారుడిగా వైభవుడు



వైభవ వేంకటేశ్వర స్వామి



అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న వాత్సల్య బృందం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ధర్మ ప్రచారోత్సవాల్లో భాగంగా బుధవారం వైభవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని సర్వాంగ వజ్రకవచంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వొమ్మి వాత్సల్య బృందం ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు భక్తులకు అలరించాయి. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పరిశీలించారు.

వైభవోపేతం.. దుర్గాదేవి అనుపోత్సవం



ఊరేగింపులో కోలాటమాడుతున్న చిన్నారులు, పాల్గొన్న కె.కె.రాజు, సంపంగి శ్రీనివాసరావు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా బుధవారం రాత్రి అమ్మవారి విగ్రహ అనుపోత్సవం వైభవంగా నిర్వహించారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ సంపంగి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొని మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కొబ్బరికాయ కొట్టి అనుపు మహోత్సవం ప్రారంభించారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారి ఘటాలు మోస్తూ ఊరేగింపుగా ముందుకు సాగారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ అమ్మవారి దీవెనలతో నియోజకవర్గ ప్రజలతోపాటు రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. త్వరలో విశాఖ నుంచి పరిపాలించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎటువంటి అడ్డంకులు ఉండకుండా చూడాలని అమ్మవారిని కోరారు. ఊరేగింపులో చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉత్సవ ఆర్గనైజర్ బండారు గుప్తాజీ, రాజారెడ్డి, రాయుడు శ్రీను, రామిరెడ్డి, రాజేష్‌రెడ్డి, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

అభాగ్యురాలికి సేవలు



దాబాగార్డెన్స్: పాత నగరంలో గల స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు ఓ అభాగ్యురాలిని చేరదీశారు. ఆమె ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజన సమయానికి సంస్థ వద్దకు రావడం.. భోజనం చేసి వెళ్లిపోవడం చేస్తోంది. ఆమె తలంతా కురుపులతో మానసికంగా బాధపడుతున్నట్టు గుర్తించిన ఆయన ఆమె జుట్టు కత్తిరించి సంస్థ మహిళలచే స్నానం చేయించి, తల పుండ్లకు మందు రాసి సేవలందించారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో రమాబాయి, భక్తులు



ప్రశంసాపత్రాలతో చిన్నారులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వహస్తాలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. అర్చకుడు శ్రీనివాస్ భక్తుల గోత్ర నామాలతో విశేష పూజలు నిర్వహించారు. ప్రతి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పసుపు నీళ్లతో అమ్మవారిని అభిషేకించడం ఆనవాయితీ అని ఆయన తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఈవో రమాబాయి, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్ర ఎరుకుమాంబ ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సిరి డ్యాన్స్ అకాడమీ స్వర్ణ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

జగన్నాథస్వామి దేవాలయంలో..

అల్లిపురం: టౌన్ కొత్తరోడ్డు శ్రీ జగన్నాథస్వామి దేవాలయంలో ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా బుధవారం నాల్గవరోజు కార్యక్రమంలో భాగంగా ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీ కళా సంగీత నృత్య నికేతన్ విద్యార్థులు రమాసుందరి, చెట్టి హారిక సాయి నేతృత్వంలో విద్యార్థులు కూచిపూడి నృత్యం ప్రదర్శించారు.

డాక్యుమెంట్లు ఇచ్చేందుకు నిరాకరణ



జీవీఎంసీ అధికారులను వివరాలు అడుగుతున్న స్థానికులు

సీతమ్మధార : దొండపర్తిలోని కుప్పిలివారివీధి, అల్లూరి వీధి, మండావారి వీధిలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కొంత మేర పోతుందని యజమానులకు జీవీఎంసీ జోన్–5 ఏసీపీ రామకృష్ణ, టీపీవో విజయకుమార్ తెలిపారు. ప్లాన్‌లు, డాక్యుమెంట్లు ఇవ్వాలని కోరారు. దీనికి స్పందించిన గృహ యజమానులు నోటీసులు ఇవ్వాలని, ఇలా అర్ధంతరంగా వచ్చి డాక్యుమెంట్లు అడగడం సరికాదని స్పష్టం చేశారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. జోన్–3లో ఉన్న 27వ వార్డుకు జోన్–5 అధికారులు రావడం కరెక్ట్ కాదని స్థానికులు అంటున్నారు.